# బర్త్ డే

మాకు కొత్తగా వచ్చిన బ్రాంచి మేనేజరుగారు ఆరోజు పుట్టిన రోజు జరుపుకుంటున్నారు. మేమందరం ఆయన హోదాకు తగ్గట్టుగా కానుకలు వగైరా తీసుకు వెళ్ళాం.

ఏభై సంవత్సరాలకు గుర్తుగా ఏభై చిన్న కొవ్వొత్తులతో పెద్ద కేకు పెట్టారు బల్లమీద.

ఆయన విమల్ సూటింగ్‌లో ఏభై సంవత్సరాలు వుండవనిపించేట్లుగా వున్నాడు. చకచకా నడుచుకుంటూ అందర్ని విష్‌చేస్తూ కేక్‌వున్న టేబుల్ దగ్గరకు చేరారు. ఆయన కేక్ కట్‌చేసి మొదటి పీస్ ఆయన భార్యామణికి ముద్దుగా, ఆమెతో పాటుగా ఆయన కూడా నోరు తెరిచినంత పని చేసి ఆమె నోట్లో పెట్టారు. మిగతా ముక్కలు కొందరికి ముఖ్యులకు పెట్టారు.

"ఛీర్స్"

"హేపీ బర్తుడే టూ యూ", "మెనీ హేపీ రిటర్న్స్" అంటూ అరుపులు, కేకలు, పాటలు వినిపించాయి.

నేను ఆఫీసులో కీలకమైన పోస్టులో వుండడంచేత అందరికీ అన్నీ అందాయో, లేదో చూసే బాధ్యత తీసుకోవాల్సి వచ్చింది. అలా రౌండ్స్ తిరుగుతున్నాను.

మా బ్రాంచి మేనేజర్‌గారు మరో ప్రముఖ వ్యక్తితో జోక్స్ కట్ చేస్తున్నారు. పగలబడి నవ్వుకుంటున్నారు ఇద్దరూ.

నేను వెళ్ళి వెనక నిలబడ్డాను ఆ జోక్స్ విందామని.

"ఏమిటోయ్ పేద్ద-రెండు నెలల క్రితమే కదా బాంబేలో నీ బర్తుడే చేసుకున్నావు? అప్పుడే బర్తుడే ఎలా వచ్చిందోయ్, రియల్లీ ఇటీజ్ ఫన్నీ"

"బర్తుడే దేమురుందోయ్ మనిష్టం. ఇక్కడ బ్రాంచికి కొత్తగా వచ్చాను. ఎన్నాళ్ళుంటానో తెలియదు. పార్టీ పెట్టాలనిపించింది. అకేషన్ దొరకలేదు. అందుకని ఇది. దీనివల్ల రెండు లాభాలు-ఒకటి మన ప్రిస్టేజ్ పెరుగుతుంది. రెండోది మనప్రాపకం కోసం ప్రాకులాడే వాళ్ళు విధిగా మంచి బహుమతులు తెస్తారు. అదిగో అటు చూడు" అని చూపిస్తున్నారు మా బ్రాంచి మేనేజరుగారు.

ఆయన చూపించిన వేపు మినీ ఫ్రిజ్, ప్రెజర్ కుక్కర్, వాటర్ ఫిల్టర్, మిక్సీలు, ట్రాన్సిస్టర్లు, టు-ఇన్-వన్‌లు వగైరాలు.

బ్రాంచి మేనేజర్‌గారితో మాట్లాడుతున్న వ్యక్తి "హేట్స్ ఆఫ్ టు యువర్ వైఫ్——" మిగతా మాటలు నేను వినలేదు. చాలీ చాలని జీతాలతో మేము కష్టపడి కొన్న ప్రజంటేషన్స్ నన్ను చూసి వెక్కిరిస్తున్నట్టుగా భ్రమపడ్డాను.

....★....

# బదిలీ

అధికారం చేతిలో ఉంటే ఏ పనైనా చేసుకోవచ్చు అనుకోవడం పొరపాటు.

అది ఒక ప్రభుత్వ కార్యాలయం, కాకినాడలో ఉంది. శాఖలు రాజమండ్రి, విశాఖపట్నం, పలాస, ఇచ్ఛాపురంలో ఉన్నాయి. చాలామంది సిబ్బంది. అందువల్ల ఆఫీసరుగారు శాఖా కార్యాలయాలన్ని తిరుగుతూ ప్రధానమంత్రి విదేశీ పర్యటనలు చేస్తూ అప్పుడప్పుడూ దేశంలో ఉన్నట్లుగా—కాకినాడలో నాలుగురోజులు ఉండి సంతకాలు పెడుతూ ఉంటారు.

ఆ ఆఫీసులో డిస్పైన్సు విభాగంలో చిన్న ఉద్యోగి మురళి—అఫీసరుగారికి స్వయానా బావమరిది. దానితో ముఖ్యమంత్రిగారి చిన్నల్లుడులాగా ఆఫీసులో అందరిమీదా అధికారం చెలాయిస్తుంటాడు. అతనికి కళ్ళెం వెయ్యడం ఎవరివల్లా కావడంలేదు.